క్లుప్తంగా

సుల్తాన్ షహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ వద్ద ఉన్న సుల్తాన్ షహీద్ దర్గాలో గంధ మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సుల్తాన్ షహీద్ సమాధిపై గలేపులు కప్పి పూలతో అలంకరించారు. సంప్రదాయంలో భాగంగా భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు.

అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలి



సీతారామపురం: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని ఆంధ్ర విద్యార్థి సంఘ మండల నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఈఓ మస్తాన్‌వలికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్ విక్రయాలు చేపడుతున్నారని, వాటిపై చర్యలు చేపట్టాలని కోరారు. సంఘ ఉదయగిరి నియోజకవర్గ కోకన్వీనర్ చెరుకూరి ఖాజా, నాయకులు సురేష్, ఆజాద్, గురుస్వామి, కుశల్ పాల్గొన్నారు.

సంగం బ్యారేజ్‌ను సందర్శించిన ఆర్డీఓ



సంగం: స్థానిక ఎంజీఆర్ సంగం బ్యారేజ్‌ను ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత శుక్రవారం సందర్శించారు. బ్యారేజ్ వద్ద రొట్టెల పండగ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన రక్షణ చర్యలను పరిశీలించారు. యాత్రికులు బ్యారేజ్‌లోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రమాదేవి, ఎస్సై నాగార్జునరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా రొట్టెల పండగ



ఉదయగిరి: స్థానిక పెద్దచెరువు వద్ద రొట్టెల పండగను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. జోరు వర్షంలోనే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం రొట్టెలను మార్చుకున్నారు. అనంతరం ఫత్తర్, ఖబర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రైతుబజార్ ప్రారంభం



అల్లూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లూరులోని రాయాజీ వీధిలోని పీవీఎస్ ప్రావిజన్స్ షాపులో ఏర్పాటు చేసిన రైతు బజార్ ప్రత్యేక కౌంటర్‌ను తహసీల్దార్ దుర్గేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో కందిపప్పు కిలో రూ.181 ఉండగా, రైతు బజార్‌లో రూ.160కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. మార్కెట్లో నాణ్యమైన బియ్యం కిలో రూ. 55 ఉండగా, రైతుబజార్‌లో రూ.49కే అందజేస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసువాలని కోరారు.

రాజకీయ కక్ష సాధింపు చర్యలు తగవు

సోమశిల: స్కీం వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న ఆశా, అంగన్‌వాడీ, వెలుగు, వీఓఏల పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు తగవని సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బొమ్మవరం గ్రామ ఆశావర్కర్‌ను రాజకీయ కక్ష సాధింపుతో రెండు వారాల క్రితం తొలగిస్తున్నట్లుగా ప్రకటించారని తెలిపారు. ఆమెకు ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ మద్దతుగా నిలిచి కలెక్టర్, డీఎంహెచ్‌ఓ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో తిరిగి విధుల్లోకి చేర్చుకున్నారని వివరించారు. స్కీం వర్కర్లపై రాజకీయ కక్ష సాధింపు చర్యలను సీఐటీయూ ఉపేక్షించదని, ఎంత వరకు అయినా పోరాడుతుందన్నారు. ఇలాంటి తప్పుడు చర్యలపై స్కీం వర్కర్లు ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు.

ఉదయగిరిలో చిరుజల్లులు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో పాటు చలితో కూడిన ఈదురు గాలులు వీస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ఈ వర్షాలు మెట్ట పంటల సాగుకు అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు

గ్రామాలను రక్షించే గ్రామసింహాలు మృత్యుసింహాలుగా మారుతున్నాయి. విశ్వాసం చూపించాల్సిన కుక్కలే కాటేస్తున్నాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ అటుగా వెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటేనే భయపడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తుండడంతో భయాందోళనలకు గురై తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మరో వైపు మూగజీవాలైన గొర్రెలు, మేకలపైన కూడా దాడి చేసి గాయపరుస్తుండడంతో మూగజీవాల పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–ఉదయగిరి/కావలి/ ఆత్మకూరు

- పట్టణాలు, గ్రామాల్లో వీధి కుక్కల స్వైరవిహారం
- గుంపులుగుంపులుగా తిరుగుతూ దాడి
- వీధుల్లోకి రావాలంటే జంకుతున్న చిన్నారులు, మహిళలు, వృద్ధులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న చిన్నారి పేరు ములకా భవ్యశ్రీ. కలిగిరి పంచాయతీ పరిధిలోని పాపనముని లిపాళెం గ్రామం. గురువారం ఇంటి వద్ద నుంచి దుకాణానికి వెళ్లి వస్తుండగా వీధికుక్క దాడి చేసి కరిచింది. కుటుంబ సభ్యులు కలిగిరిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించారు. గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని పిల్లలను బయటకు పంపాలంటే భయంగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.



ఈ బాలుడి పేరు ఈశ్వర్ తేజ్ నాయుడు. ఆత్మకూరులోని స్పార్క్‌సిటీ ప్రాంతం. రెండ్రోజుల క్రితం ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధికుక్క కరిచింది. గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.



కావలి: రోడ్డుపై స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు



కలిగిరిలోని ఓ ఇంటి ముందు తిష్ట వేసిన కుక్కలు



ఆత్మకూరులో చికెన్ దుకాణాల వద్ద గుంపుగా ఉన్న కుక్కలు

ఉదయగిరి నియోజవర్గ వ్యాప్తంగా గ్రామసింహాల బెడద ఎక్కువగా ఉంది. వీధి కుక్కలను చంపడం నేరం కావడం పెద్ద సమస్యగా మారింది. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో వాటి సంఖ్య ఏటా పెరుగుతోంది. పశు వైద్యులు, పంచాయతీ పాలకులు సంయుక్తంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం ద్వారా వాటి సంఖ్యను అరికట్టవచ్చు. కానీ ఆ దిశగా చొరవ చూపకపోవడంతో గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏటా ఉదయగిరి నియోజవర్గ వ్యాప్తంగా అధికార లెక్కల ప్రకారం రెండు వేల మంది కుక్క కాటుకు గురవుతున్నట్లు సమాచారం. అంతేకంటే ఎక్కువ సంఖ్యలో జీవాలను వెంటాడి కరుస్తున్నాయి. పిచ్చి కుక్కకాటుకు గురైన వారు సరైన సమయంలో వైద్యం పొందక పాణాలను పోగొట్టుకుంటున్న పరిస్థితులు కూడా ఉంటున్నాయి. అందుకే వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత పంచాయతీల పాలకులతో పాటు పశువైద్య సిబ్బందిపై కూడా ఉంది.

- కావలి నియోజకవర్గంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ దడ పుట్టిస్తున్నాయి. కావలి, అల్లూరు, దగదర్తి, బిట్రగుంట, తదితర ప్రాంతాల్లో రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ కాటేస్తున్నాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరిని హడలెత్తిస్తున్నాయి. ప్రధానంగా కావలి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. వీధి కుక్కల నియంత్రణలో నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల అనంతసాగరంలో ప్రజలు చంపేసిన పిచ్చికుక్క

- ఆత్మకూరు నియోజకవర్గంలోనూ వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు మండలాల్లోనూ వీధి కుక్కల బెడదతో ప్రజలు హడలిపోతున్నారు. పట్టణంలో చిన్నారులు, వృద్ధులు ఒంటరిగి వెళ్తున్న సమయంలో దాడి చేసి గాయపరుస్తున్నాయి. రెండ్రోజుల క్రితం స్పార్క్ సిటీలో ఇంట్లో ఆడుకుంటున్న చిన్నారిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. ఇలాంటి ఘటనలు ఇటీవల పదుల సంఖ్యలో చోటు చేసుకున్నాయి. రెండు, మూడేళ్ల క్రితం మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలను పట్టి టీకాలు వేశారు. ఇటీవల కాలంలో వీధి కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి బెడద ఎక్కువైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాను సంప్రదించగా గత మూడ్రోజులుగా కుక్కలను పట్టే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే 20 వీధి కుక్కలకుపైగా పట్టి సంతాన నిరోధక ఇంజక్షన్లు వేయించినట్లు చెప్పారు.

కుక్కల బెడద ఎక్కువగా ఉంది



వరికుంటపాడులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లో గుంపులు గుంపులుగా చేరి చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. స్థానికంగా రేబిస్ ఇంజక్షన్లు అందుబాటులో లేక కుక్క కాటుకు గురైన వారు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల బెడద నుంచి పాలకులు, అధికారులు ప్రజలను కాపాడాలి.

–కొండిశెట్టి, వరికుంటపాడు

చిన్నారులపై దాడి చేస్తున్నాయి



ఉదయగిరిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నాయి. ఇటీవల సినిమాహాల్ సెంటర్ వద్ద ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో ప్రాణాలకే ప్రమాదం ఏర్పడింది. కొద్ది రోజుల తర్వాత కోలుకున్నారు.పంచాయతీ పాలకులు స్పందించి వీధి కుక్కల బెడదను తొలగించాలి.

–అశోక్, విశ్రాంతి ఉద్యోగి, ఉదయగిరి

జీవాలను కాపాడాలి



పల్లెల్లో కుక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిల్లో కొన్నింటికి పిచ్చిపట్టి మనుషులతో పాటు మూగ జీవాలను కాటేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కుక్కల దాడిలో జీవాలు చనిపోతుండడంతో నష్టపోతున్నాం. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి.

– వింజం కొండపనాయుడు, తూర్పుబాపనపల్లె

నియంత్రణకు చర్యలు చేపట్టాలి



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా ధైర్యంగా తిరిగే పరిస్థితి కల్పించడం లేదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

–మీరా, కావలి

పిచ్చికుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలో శుక్రవారం పిచ్చి కుక్క హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మరో ఇద్దరిపై దాడికి యత్నించగా తప్పించుకున్నారు. అనంతరం గ్రామస్తులు పిచ్చి కుక్కను వెంటాడి చంపేశారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వ్యక్తి సోమశిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

కావలి : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని లోక్ అదాల్ చైర్మన్ ఎం శోభ తెలిపారు. కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కావలి న్యాయవాదుల సంఘ హాల్లో హెల్మెట్ వినియోగంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత స్థానిక కోర్టు నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు హెల్మెట్ వినియోగంపై న్యాయవాదులు అవగాహన ర్యాలీని నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని, లేకపోతే జరిమానా విధించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, స్పెషల్ మేజిస్ట్రేట్ పరుసురాం, అడిషనల్ పీపీ రామకృష్ణ, ఏపీపీ మృదుల, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, కార్యదర్శి జయప్రకాష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఆర్టీసీ మెకానిక్‌కు తీవ్ర అస్వస్థత

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్న వీడీఆర్ రెడ్డి శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సహచర కార్మికులు వెంటనే 108 వాహనంలో ఆయన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా గ్యారేజీలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న బాబురావు కార్మికులపై కర్కశంగా వ్యవహరిస్తున్నారని, వీడీఆర్‌రెడ్డిని సాయంత్రంలోగా దగ్గరుండి సస్పెండ్ చేయిస్తానని హెచ్చరించడంతోనే ఆయన మానసిక ఒత్తిడికిలోనై బస్సులో మరమ్మతులు చేపడుతూ కుప్పకూలిపోయినట్లు గా కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై డిపో మేనేజర్ కరీమున్నీసాను ఫోన్‌లో వివరణ కోరగా వీడీఆర్‌రెడ్డి మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా బస్సు రిపేరు చేస్తూ అస్వస్థతకు గురైనట్లుగా తెలిసిందన్నారు. తాను రొట్టెల పండగకు వచ్చే భక్తుల కోసం అనుమసముద్రంపేటలో విధి నిర్వహణలో ఉన్నానన్నారు. సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

అనుమసముద్రంపేట: పెద్దబ్బీపురంలో సాగునీటి కాలువను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బంది శుక్రవారం తొలగించినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ నెల 10న పెద్దబ్బీపురంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న ఇరిగేషన్ కాలువ స్థలాన్ని డీ మాలకొండయ్య అనే వ్యక్తి ఆక్రమించి గదిని నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పది రోజుల క్రితం నిర్మాణదారుడికి నోటీసులు జారీ చేశామని, స్పందించకపోవడంతో రెవెన్యూ సిబ్బందితో ఆక్రమణలను తొలగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

శేష వాహనంపై చెన్నకేశవస్వామి



సంగం: మండలంలోని మర్రిపాడులో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శేష వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

23 నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీనాయక్ శుక్రవారం తెలిపారు. 23న మురగళ్ల, వెన్నవాడ, 24న అశ్వనీపురం, కరటంపాడు, 25న మహిమలూరు, వాశిలి, 26న రామస్వామిపల్లి, చెర్లోయడవల్లి, 27న అప్పారావుపాళెం, బట్టేపాడు, బోయలచిరివెళ్ల గ్రామాల్లో శిబిరాలు ఉంటాయని వివరించారు.

అన్నదానం

ఆత్మకూరురూరల్: మండలంలోని నల్లపరెడ్డిపల్లిలోని రామాలయం వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం మేరకు తొలి ఏకాదశి మరుసటి రోజు రామాలయం వద్ద కరవళ్ల కుటుంబీకులు అన్నదానం చేశారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

మర్రిపాడు: ప్రభుత్వం సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని బీటీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లం వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిపాడు ఆదర్శ పాఠశాల, నందవరం, కంపసముద్రం, పోలిరెడ్డిపల్లి, టీపీ న్‌పేట, చించులూరు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించి ఉపాధ్యాయుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు సుబ్బు మాట్లాడుతూ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు, ఉదయగిరి డివిజన్ కన్వీనర్ వెంకటముని పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



సంగం: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రనకు చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, అన్ని శాఖల అధికారులు తెలిపారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఉదయగిరి: ఉదయగిరి–బండగానిపల్లి మార్గంలో అటవీ అనుమతులు లేక ఆగిపోయిన ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసి ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య కోరారు. బండగానిపల్లిలో ఘాట్‌రోడ్డు సాధన సమితి, సీపీఎం ఆధ్వర్యంలో బండకిందపల్లిలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అనుమతులు లేక 3.2 కి.మీ మేర ఘాట్‌రోడ్డు నిర్మాణం గత కొన్నేళ్ల నుంచి ఆగిపోయి ఉందన్నారు. ఈ కారణంగా పది గ్రామాల్లోని 16 వేల మంది జనాభా ఉదయగిరికి రాకపోకలు సాగించేందుకు అవస్థ పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రావెల్ రోడ్డు కోతకు గురై ద్విచక్ర వాహనాలు కూడా రాలేని పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల మొరను ఆలకించి ప్రభుత్వం వెంటనే ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆత్మకూరురూరల్: మండలంలోని మురగళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ, మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు అనూషాకుమారి, దేవానంద్ దోమలతో వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, తదితర వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం నల్లపరెడ్డిపల్లిలో డెంగీ వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు.

మర్రిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై మర్రిపాడు పీహెచ్‌సీ డాక్టర్ గోపినాథ్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలతో వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా వ్యాధులు..వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ప్రధానోపాధ్యాయిని లక్ష్మీదేవి, హెచ్‌ఈఓ కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాడి తప్పిన గస్తీ

- చెలరేగిపోతున్న దొంగలు
- ఓ వైపు అక్రమంగా ప్రకృతి సంపద రవాణా
- మరోవైపు గ్రామాల్లో జోరుగా అశ్లీల నృత్యాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో పోలీసు గస్తీ గాడి తప్పడంతో వరుస చోరీలతో దొంగలు పెట్రేగిపోతున్నారు. రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేసి చోరీలను అరికట్టాల్సిన పోలీసులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే నిద్రమత్తులో ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సొంత ఆదాయ వనరుల కోసం తాపత్రయ పడుతూ ప్రజాసంక్షేమమే తమ ప్రథమ కర్తవ్యమనే భావనను అనేక మంది ఖాకీలు మరిచిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలో చోటు చేసుకున్న పలు ఘటనలను పరిశీలిస్తే ఇది నిజమే అని నమ్మాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

- ఉదయగిరిలో రెండు నెలల వ్యవధిలో నాలుగు చోరీలు జరిగాయి. ఇళ్లలో ఎవరూ లేనప్పుడు ఈ చోరీలు జరిగాయి. అంటే తెలిసిన వారే ఈ దొంగతనాలు చేసి ఉండొచ్చు. కానీ ఇంతవరకు నిందితులను పోలీసుల గుర్తించలేదు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 17న వింజమూరులోని సాయిబాబా మందిరం సమీపంలో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సుమారు రూ.10 లక్షల విలువ చేసే బంగారు నగలను దొంగలు అపహరించుకెళ్లారు. చోరీకి పాల్పడిన వ్యక్తి చిత్రాలు కూడా పలు చోట్ల సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఐదు నెలలు గడిచిన ఇంత వరకు దొంగను గుర్తించలేదు. దర్యాప్తు ఏమైందో పోలీసు అధికారులకే తెలియాలి.
- వింజమూరు మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల హుండీలను పగులగొట్టి చోరీలు చేశారు. వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి అందులోని విలువైన రాగి తీగలు అపహరిస్తున్నారు. అయినా కేసుల్లో పురోగతి లేదు. అలాగే కొండాపురం, కలిగిరి మండలాల్లో జరిగిన పలు చోరీలకు సంబంధించి కేసులు నమోదై నెలలు గడుస్తున్నా అతీగతీలేదు.
- 20 రోజుల క్రితం వరికుంటపాడులోని కోల్డ్ స్టోరేజ్‌లోని రూ.15 లక్షల విలువ చేసే పొగాకు బేళ్లను దొంగలు దర్జాగా వాహనాలపై వేసుకుని పోలీస్‌స్టేషన్ ముందే నింపాదిగా వెళ్లారు. ఆ రోజు పోలీసులు హడావుడి చేసినా లెక్క చేయకుండా మళ్లీ రోజు మరికొన్ని బేళ్లను అపహరించుకెళ్లేందుకు వచ్చారు. చోరీ జరిగిన వెంటనే రైతులు తమ బేళ్లను తీసుకెళ్లడంతో అక్కడ ఏమీ లేక వెనుతిరిగారు. ఆ తర్వాత కూడా రెండు, మూడు చిన్నచిన్న చోరీలు జరిగాయి. మంగళ, బుధవారాల్లో రాత్రి వేళ దొంగలు స్వైర విహారం చేశారు. ఇళ్లు, ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఎస్సై పట్టించుకోకపోవడంతోనే చోరీలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు నియంత్రణలో ఉండే నిఘా నేత్రాలు సైతం పనిచేయకపోవడంతోనే దొంగలను పట్టుకోలేకపోతున్నారని, ఇది పోలీసు నిర్లక్ష్యాన్ని పరాకాష్ట అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వింజమూరులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)


యథేచ్ఛగా ప్రకృతి వనరుల అక్రమ రవాణా

ఉదయగిరి నియోజకవర్గంలోని పలువురు పోలీసులు తమ డ్యూటీని మరిచి అక్రమ సంపాదనపై దృష్టి పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పక్షానికి కొమ్ము కాస్తూ వారి సేవలో తరిస్తున్నారనే వాదన బలంగా ఉంది. పిల్లాపేరు, ఉప్పువాగు, మన్నేరు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసులు మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. వరికుంటపాడు, కొండాపురం, వింజమూరు మండల కేంద్రాల్లో నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం వెనుక రహస్యం వారికే తెలియాలి. రాత్రి వేళల్లో నిత్యం తెల్ల రాయి(క్వార్ట్జ్) అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికార పక్షం నుంచి ఒత్తిడి వస్తే మాత్రం వారికి గిట్టని వారి వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు.

అశ్లీల నృత్యాలా మాకు కనబడవు

అశ్లీల నృత్యాలపై నిషేధం ఉన్నా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జోరుగా ప్రదర్శిస్తున్నారు. వరికుంటపాడు, కొండాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో అర్ధరాత్రి వేళ అశ్లీలనృత్యాల చిందులు రక్తి కట్టిస్తున్నాయి. సోషల్ మీడియాలో కూడా వీడియోలు వైరల్ అవుతున్నాయి. అయినా పోలీసులు మాకు కనబడడం లేదన్నట్లుగా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

చోరీలపై ప్రత్యేక నిఘా



ఇటీవల వరుసగా చోరీలు జరుగుతుండడంతో ఉదయగిరి సర్కిల్ పరిధిలో ప్రత్యేక నిఘా పెట్టాం. దొంగల ఆచూకీ కూడా కొంతమేర తెలిసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో త్వరలో దొంగలను పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేస్తాం. ఇసుక అక్రమ రవాణా, అశ్లీల నృత్యాల ప్రదర్శన జరిగితే సహించం.కేసులు నమోదు చేస్తాం. శాంతి భద్రతల విషయంలో రాజీపడబోం. విధుల్లో అలసత్వం వహించే పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

–గిరిబాబు, సీఐ, ఉదయగిరి